# ది ట్రయల్



'మైడియరెస్ట్ రమా !

ఇవ్వాళ కలకత్తా నుంచి మా నాన్నగారు వస్తున్నారు. ఆయనతో మన విషయం చెప్పి, వెంటనే వ్యవహారాన్ని సెటిల్ చేస్తాను. ఆయన నా మాటను కాదనరు. అందువలన, నువ్వు తియ్యని కలలు కంటూ, వొచ్చే నెలలో మన పెళ్ళి అవగానే, మన హనీమూన్ గురించి ప్లాను చెయ్యి. సబిత గురించి వ్రాసావు గదూ ! షి ఈజ్ ఏ ఫూల్. క్లాసుమెట్ గనుక, ఏదో ఎంటర్టెయిన్ చేస్తున్నాను గానీ, అయ్ డోంట్ లయిక్ హర్ ! ఈ సంగతి తనకి మొహం మీద చెప్పేయలేక పోతున్నాను. నేనంటే పిచ్చి వ్యామోహంలో పడింది. వాట్ కెన్ ఐడూ ?! మన పెళ్ళి అయ్యాక, అసలు సంగతి తెలిసి తనే సర్దుకుంటుందిలే ! పూర్ గాల్ ! ఒక పది రోజులలో, పెళ్ళి కొడుకుగారు, పెద్దలతో కలిసి, పెళ్ళిచూపుల కోసం వస్తారు. గెట్ రెడీ. ఈ వుత్తరంతోపాటు సబితకి కూడా ఒక వుత్తరం, వేరే వ్రాస్తున్నాను. తను నన్నర్థం చేసుకోదు. వుత్తరాలలోనే నన్ను చంపేస్తుంది. నాకూ, తనకి జవాబివ్వక తప్పటంలేదు. అయినా ఇది ఇంకా ఎన్నాళ్ళో సాగదులే. మన వివాహం సంగతి తెలియగానే సబిత, తనే ఆ వుత్తరాల ట్రాక్‌ని బంద్ చేసేస్తుంది. సబిత గురించి ఎక్కువగా ఆలోచించి బుర్ర వెడగొట్టు కోవద్దు, నువ్వు. ఐ లయిక్ హర్. దట్స్ ఆల్ ! బట్ అయ్ లవ్ యూ. అందుకే నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాను— యువర్ డియరెస్ట్ శేషు.'

ఉత్తరం రాయటం ముగించి, మూర్తికిచ్చాడు శేషు. అతని మొహాన చిరునవ్వులూ, చిరుచెమటలు పట్టాయి. సిగరెట్ వెలిగించి రెండు పఫ్‌లు లాగి రిలాక్సయ్యాడు, శేషు.

ఆ ఉత్తరం చదివి, ఆశ్చర్యపోయాడు మూర్తి.

'ఈ రమ ఎవరు ?' అని అడిగాడు మూర్తి.

'మన క్లాస్‌మేట్' — తాపీగా అని చిరునవ్వు నవ్వాడు, శేషు.

'నువ్వు ఈ గ్రంథం ఎప్పుడు నడిపావ్ ?! ఇప్పటిదాకా వెంటబడి, వుత్తరాలు రాసి సబితని లవ్ చేసావు గదా ?'

'ఇందులో గ్రంథం ఏం లేదు! జస్ట్ ట్రయల్. సబిత నన్ను ఎంత గాఢంగా లవ్ చేస్తోందో తెలుసుకోనటాన్కి ఒక చిన్న ప్రయత్నం.'

'అంటే ?!'

'రమతో నాకు పరిచయం వుంది గానీ, ఇటువంటి వ్యవహారం అసలు లేదు '

'మరి ఈ వుత్తరం ఏమిటే ?'

'ఈ వుత్తరం రమకు చేరదు. ఇదుగో ఈ కవర్‌పైన ఎడ్రస్ చూడు. ఇది సబిత ఎడ్రస్. నేను పొరపాటున, రమకి రాసిన వుత్తరం సబితకి అందినట్లు అన్పిస్తుంది. ఇందులోని కంటెంట్స్ చదివి సబిత కంగారు పడుతుంది. ఆశ్చర్యపోతుంది ?'

'ఆ తరువాతా ...!'

'తర్వాత తను తిన్నగా నా దగ్గరకి వచ్చి నన్ను కడుగుతుంది, తిడుతుంది, ఏడుస్తుంది. కోపంతో నా చంప పగలగొట్టుంది. చివరికి నాకు పశ్చాత్తాపం కలిగి, ఆమెను క్షమాపణ కోరతాను. ఆమెకి అసలు సంగతి చెబుతాను. మా ఇద్దరి మధ్యా అసలు రమకి

పాలడుగు వెంకటేశ్వరరావు

స్థానమే లేదని చెపుతాను. ఆమె యొక్క టియర్స్ అపుడు ఆనందాశ్రువులుగా మారి ఆమె నా కౌగిలిలో ఒదిగిపోతుంది. జస్ట్ దట్! దస్ ది లవ్ స్టోరీ ఎండ్స్ విత్ ఏ టింత్ ఆఫ్ థ్రిల్!' నవ్వాడు శేషు.

'ఇలాగే జరగాలనేముందీ?'

'మరెలా కూడా జరుగవచ్చు నంటావ్? నువ్వు చెప్పు, వింటామా'

'నువ్వు రాసిన ఈ వుత్తరాన్ని నమ్మి, ఆమె రమ దగ్గరకే వెళ్ళి, అల్లరి చెయ్యవచ్చును. గొడవా జరుగవచ్చును. సబిత నువ్వు తనకి రాసిన వుత్తరాన్ని బయట పెట్టవచ్చును.'

'ఇట్ కెన్ హాపెన్. ఈ లేడీస్ వట్టి సెంటిమెంటల్ ఫూల్స్! సబితా మే ఫైట్ విత్ రమా! ఎందుకంటే సబిత నన్ను గాఢంగా ప్రేమిస్తున్నది. నాకు తెలుసు.'

'అదే నేననేది! అలా అల్లరవటం న్యూసెన్స్ గదా!'

'నిజమే. కాని, అలా జరగదు.'

'ఎందువలన?'

'రమ వూళ్ళో లేదు. నిన్ననే బెజవాడ వెళ్ళింది. పదిరోజులదాకా రాదు — నెక్స్ట్?!'

'ఈ వుత్తరం దెబ్బకి విరక్తి చెంది, ఆమె ఆత్మహత్యకి పూనుకోవచ్చును.''

'నిజమే. ఈ ఆడవాళ్ళల్లో ఎంత పిరికితనం వుందో, అంత సాహసమూ వుంది. అందువలన ఈ ఉత్తరం సబితకి అందిన క్షణం నుంచీ, ఆమెమీద, కాపలా వుంటుంది. స్ట్రిక్ట్ విజిలెన్స్. నా మనిషి ఆమె ప్రయత్నాలను గమనించిన వెంటనే, ఆ విషయం క్షణాలలో నాకు తెలుస్తుంది.'

'ఎలాగా?'

'ఫోనుమీద.'

'అయితే —'

'నేను వెంటనే అక్కడికి వచ్చి వాలతాను. అయ్ విల్ ఫేస్ ది సిట్యుయేషన్! కథను సుఖాంతం చేయగల సామర్థ్యం నాకు వున్నదని నా నమ్మకం' దృఢంగా అన్నాడు శేషు.

'నిజంగా నువ్వు అంతటి హీరోవే! కాని, ఇటువంటి దుందుడుకు పనులు ఎటువంటి వారికి కూడా తగవని, నా వుద్దేశ్యం. ఆ తర్వాత విచారించి లాభం లేదు. నా మాట విను శేషూ.'

'ముసలి కబుర్లు చెప్పకు. యూ ఆర్ ఏ వెంగ్ మాన్! ఈజిన్టిట్!?'

'సరే. ఇంతకీ ఎవరా కాపలాదారూ?'

'ఇంకెవరు? నువ్వే.'

'నేనా?!'

'అవును. దూరపు చుట్టరికం వలన, సబిత తల్లిదండ్రులతో పరిచయమూ, ఆ ఇంటికి నీ రాకపోకలూ, వున్నాయి. సబిత నన్ను లవ్‌చేసి, నన్నే పెళ్ళి చేసుకోవాలని గట్టిగా పట్టుబట్టటం వలన, నువు ఫెయిలయ్యావుగానీ, నువ్వు, ఆ ఇంటికి అల్లుడవవలసిన వాడివిగదా. నాతో పోటీ పడలేక పోయావుగానీ, నీకేం తక్కువా?'

'బాగానే వుందిలే! సింప్లీ వండ్రఫుల్. సరే, కానీ —'

'ఈ ఉత్తరం ఇవాళ పోస్టులో పడుతుందా! రేపీపాటికి సబితకి అందుతుంది. నువ్వు రేపు వాళ్ళింటికి వెళ్ళు. ఆమెను గమనించు. డిటెక్టివ్ కళ్ళతో వాచ్ చెయ్యి. వెంటనే ఇవతలికి వచ్చి, ఫోనుచేసి నాతో చెప్పు.'

'నేను అలా చెయ్యనంటే? భగ్న ప్రేమికుడనయిన నేను నా 'రైవల్'వయిన నీకెందుకు వుపయోగపడాలి?'

'డోంట్ టాక్ ట్రాష్. నువ్వు నేను చెప్పినట్లు చేస్తావు! దట్సాల్.'

'ఆ నమ్మకం ఎందుకూ, అని?'

'బికాజ్ వుయార్ ఫ్రండ్స్. గేమ్‌లో గెలుపోటములు సహజం. అంతమాత్రానికే మన స్నేహం చెక్కు చెదరటానికి వీలులేదు!'

'నేనూ, ఆ స్నేహ ధర్మంతోనే చెప్తున్నాను. ఇప్పుడయినా, నిప్పుతో చెలగాటం ఆడటం మానెయ్యి. ప్లీజ్!'

'ఇట్ విల్ బీ ఆల్ రయిట్ బాయ్! జస్టే స్మాల్ గేం ఫర్ దా థ్రిల్! దట్సాల్. డోంట్‌వర్రీ. రేపు మధ్యాహ్నం నీ దగ్గరనుంచి ఫోన్ కాల్ ఎక్స్‌పెక్ట్ చేస్తుంటాను...'

'నీ ఇష్టం' భార హృదయంతో లేచాడు మూర్తి.

'థాంక్యూ. థాంక్యూ వెరీ మాచ్!'

* * *

మర్నాడు సాయంత్రం —

గోడ గడియారం నాలుగ్గంటలు కొట్టింది. ఇంకా ఫోను రాలేదు. అసహనంగా, అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు శేషు. అతని యువక హృదయం ఉద్వేగపు అలల తాకిడికి, సంచలనాత్మకంగా వుంది.

'ట్రింగ్. ట్రింగ్. ట్రింగ్.' ఫోను మ్రోగింది. ఎగిరి గంతేసి వెళ్ళి రిసీవరు అందుకున్నాడు శేషు. 'అలోవ్...' గుండెల్నిండా థ్రిల్లు!

'హలో. నేను మూర్తిని మాట్లాడుతున్నానురా, శేషూ.'

'ఆఁ నేనేరా, మూర్తి. ఏంటి విశేషాలూ బేబీ ఎల్లా వుందీ?'

'అయాం సారీ, మై బాయ్!'

'ఏమిట్రా బాబూ? సబిత అప్‌సెట్ కాలేదు గదా?'

'షి ఈజ్ ఓకే. కాని నీ కొంపే మునిగిందిరా'

'నా కొంప మునిగిందా?! ఏమయిందిటా?'— గలగల నవ్వాడు శేషు.

'ఇవాళ నేను ఇక్కడికి వచ్చేసరికి, అనుకోకుండా మా అమ్మా నాన్నా వచ్చి వున్నారు. సబిత తన నిర్ణయాన్ని గురించి వాళ్ళ నాన్నతో చెప్పేసరికి, కూతురి కోసం ఏమయినా చెయ్యగల ఆ పెద్దమనిషి వెంటనే మావాళ్ళతో తాంబూలాలు పుచ్చేసుకున్నాడు!!'

'ఏమిట్రా నువ్వనేదీ? అసలా వుత్తరం బేబీకి అందిందా?'

'ఆఁ. అప్పుడు నేను ఇక్కడ్నే వున్నాను. తాపీగా చదివింది సబిత, వుత్తరాన్ని. చదివి ఏమందో తెలుసా? నాతోనే అన్నదిరా.'

'ఏమన్నదీ?!'

'శేషు ఇలా వుత్తరం రాసి, నాకు ఎందుకు పంపించాడో నాకు అర్థం కావటంలేదు. అతను ఇంత వీక్‌నెస్ వున్న మనిషని తెలిస్తే, నేను అతని జోలికే పోకపోదును. ప్రేమించిన ఆడదాన్ని ఇలా అవమానించే వ్యక్తులంటే నాకు చాలా అసహ్యం. అందువలన నేను ఈ క్షణంనుంచీ ప్రేమించటం మానేసి, ప్రేమించబడతాను, ఏమంటావూ? అని నన్ను అడిగిందిరా.'

'అడిగిందా?! మరి నువ్వేమన్నావురా, రాస్కెల్?'

'నేనేమనలేదుగానీ, సబితే, యమాడేరింగ్‌గా, తను నన్ను పెళ్ళి చేసుకోవటాన్కి నిర్ణయించుకున్నట్లుగా పెద్దల ముందు ప్రకటించిందిరా! అంతా అయిపోయింది! ముహూర్తాలు కూడా పెట్టేసుకున్నారు! వచ్చే నెల పదో తేదీనే మా పెళ్ళి!!'

శేషు చేతులు వణికాయి. మొహంనిండా చమట పట్టింది.

'ఇంతకీ ఇప్పుడు నువ్వు ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నావు, నాయనా!? ఘోరంగా నువ్వే ఇలా నా కొంప ముంచుతావనుకోలేదురా, మూర్తిగాడా!'

'అయాం సారీ! టేకిట్ ఈజీ. ఇట్స్ ఏ గేమ్!'

'ఇంతకీ నువ్వు ఎక్కడ్నుంచి...'

'నేను సబిత ఇంట్లోనించే మాట్లాడుతున్నాను. సబితా ఇక్కడే వుంది. మాట్లాడతావా? మా మారేజి విషయం, తనే నీతో స్వయంగా చెప్తుందట, సబిత.'

'అక్కర్లేదు.' ఫోను పెట్టేశాడు శేషు. అతని వళ్ళంతా చమటపట్టింది. కళ్ళు ఎర్రగా అయ్యాయి. మంచంమీద వాలిపోయాడు. కుప్పగా కూలిపోయాడు.

దట్సాల్. దీ ట్రయల్ కాస్డ్ ఎవ్విరీథింగ్! ★

## శబ్ద చికిత్స!

శబ్ద తరంగాలను కూడా చికిత్సగా ఉపయోగించటానికి వీలవుతుందని పశ్చిమ జర్మనీ శాస్త్రజ్ఞులు నిరూపించారు. శబ్ద తరంగాలతో ఒంటి నొప్పులను తగ్గించే పరికరాన్ని తయారుచేశారు. దీని పేరు నోవాఫోన్. శరీరంలో ఏ భాగంలోనైనా నొప్పులను తగ్గించటానికి ఈ పరికరం తోడ్పడుతుంది. నరాలు, కండరాల నొప్పులు, దవడ వాపులు, సైనసైస్ వాపులు, రక్త ప్రసరణ లోపాలకు దీనితో చికిత్స చేయవచ్చు. మందులను వాడనక్కర్లేదు. దీనివలన ఇతర దుష్ఫలితాలు ఏర్పడవు. తక్కువ ఆవృత్తి గల శబ్ద తరంగాలను కొంతకాలంగా చికిత్సకు ఉపయోగిస్తున్నారు. అయితే, ఇటువంటి పరికరాన్ని రూపొందించటం మాత్రం ఇదే ప్రథమం.